
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
సోమవారం 26 మే 2025

పాలన గాడిన పడేనా?
- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- వెలగని విద్యుద్దీపాలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో విలీన గ్రామాల ప్రజలు

8

మహిళలకు చేయూత

'మైనార్టీ మహిళా శక్తి' స్కీం కింద కుట్టు మిషన్లు

- భారీగా దరఖాస్తులు.. వడబోత ప్రక్రియలో అధికారులు
- నిబంధనల మేరకు ఎంపిక.. శిక్షణానంతరం అందజేత



మూడు అసెంబ్లీ సెగ్మెంట్ల వివరాలు


నియోజకవర్గం	దరఖాస్తులు	టార్గెట్
తాండూరు	2,649	150
వికారాబాద్	1,750	200
పరిగి	719	150
మొత్తం	**5,118**	**500**

తాండూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): 'ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి' పథకం కింద మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి వికారాబాద్ జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 500కుట్టు మిషన్లు మంజూరయ్యాయి. నారాయణపేట్, వికారాబాద్ జిల్లాల్లో విస్తరించిన కొడంగల్‌కు 1,800 కుట్టు మిషన్లు కార్పొరేషన్ మంజూరు చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం కుట్టు మిషన్లను మున్సిపాలిటీలు, మండలాల్లో పంపిణీ చేసేలా టార్గెట్‌ను నిర్ణయించారు. 2024 డిసెంబరులో ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించారు. టార్గెట్ కంటే మూడింతలెక్కువ దరఖాస్తులొచ్చాయి. దరఖాస్తుల వడబోత పనిలో అధికారులు ఉన్నారు. మైనార్టీలైన ముస్లిం, సిక్కు, బౌద్ధులు, జైన్స్, పార్శీ వర్గాల మహిళలకు నిబంధనల మేరకు కుట్టు మిషన్లను అందజేస్తారు.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇలా

ఎంపికైన వారు తన వాటా(మార్జిన్ మనీ) కింద కార్పొరేషన్‌కు రూ. 7,830 డీడీని ఎంపీడీఓ/మున్సిపల్ కమిషనర్ పేరిట తీయాలి. కుట్టు శిక్షణానంతరం సేవింగ్ మిషన్, దాని మెటీరియల్ అందజేస్తారు. తెల్ల రేషన్‌కార్డున్న వారినే ఎంపిక చేస్తారు. కార్డు లేకుంటే గ్రామీణ ప్రాంతాల వారి ఆదాయం లక్షన్నర లోపు, పట్టణాల్లోని వారైతే రూ.2లక్షల లోపు ఆదాయం కలిగి ఉండాలి. 18నుంచి55ఏళ్ల మధ్య వయస్కుల వారిని ఎంపిక చేస్తారు. కనీసం ఐదో తరగతి చదివి ఉండాలి. శిక్షణకు హాజరుకావాలి. గతంలో స్కీముల్లో లబ్ధిపొందిన వారికి మిషన్లు ఇవ్వరు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌కు 1,800 మిషన్లు మంజూరయ్యాయి. కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల్ మండలాలు వికారాబాద్ జిల్లాలో, కోస్గి, మద్దూర్, గుమ్మడాల్ మండలాలు నారాయణపేట్ జిల్లాలో ఉన్నాయి. ఇక్కడ భారీ సంఖ్యలో సేవింగ్ మిషన్లు మంజూరు కావడంతో ఎక్కువ మంది మహిళలు లబ్ధిపొందనున్నారు.

ఉమ్మడి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వీటికి పక్కా భవనాలు లేక ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆదాయం ఫుల్లుగా ఉన్నప్పటికీ పక్కా భవనాలు నిర్మించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. అద్దె భవనాల్లో అరకొర వసతులు ఉండటంతో అధికారులు, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కూర్చోవడానికి కుర్చీలు, తాగేందుకు నీరు, మూత్రశాలలు అందుబాటులో లేక సతమతమవుతున్నారు. అద్దెలు భారమవుతున్నా, సమస్యలతో తాండవం చేస్తున్నా వీటి నిర్మాణాల గురించి అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


అద్దె భవనంలో కొనసాగుతున్న పరిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

అద్దె భవనాలు.. అరకొర వసతులు!

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్వహణ అస్తవ్యస్తం

- ఉమ్మడి జిల్లాలో ఏళ్ల తరబడి పక్కా భవనాలు కరువు
- రంగారెడ్డి జిల్లాలో 18 ఆఫీసులు అద్దె భవనాల్లోనే..
- కనిపించని కుర్చీలు, తాగునీరు, మూత్రశాలలు
- ఆదాయం ఉన్నా సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం
- స్థలాలున్నా నిధులు మంజూరు చేయని ప్రభుత్వం
- పేరుకుపోయిన కోట్ల రూపాయల అద్దె


చేవెళ్ల రిజిస్ట్రేషన్ కార్యాలయం నిర్మాణం కోసం కేటాయించిన భూమి

వికారాబాద్/మేడ్చల్, మే 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అద్దె భవనాల్లో అవస్థల నడుమ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వానికి అత్యధిక ఆదా యం తెచ్చే సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. ఆదాయంలో ప్రథమ స్థానంలో ఉన్నా వసతుల కల్పనలో అధమస్థానాల్లో ఉన్నాయి. ఏళ్ల తరబడి పక్కా భవనాలకు నోచుకోవడం లేదు. కార్యాలయాల్లో కూర్చునేందుకు కుర్చీలు, తాగేందుకు నీరు, మూత్రశాలలు కూడా లేవు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అధునాతన భవనాలు నిర్మిస్తామని పాలకులు చేసిన ప్రకటనలు నీటి బుడగల్లా మారిపోయాయి. కేఫ్‌టేరియాలు, వెయిటింగ్ లాంజ్‌లు ఇతర హంగులతో కార్పొరేట్ ఆఫీసుల తరహాలో ఈ బిల్డింగ్‌లు

మిగతా 7వ పేజీలో..

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 189 మంది గైర్హాజరు

వికారాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఆదివారం జరిగిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ మ్యాథ్స్ జువాలజీ, హిస్టరీ పరీక్షలకు 189 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఫస్టియర్ పరీక్షలకు 146 మంది, సెకండియర్ పరీక్షలకు 43మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ఫస్టియర్ పరీక్షలకు 1,792 మంది విద్యార్థులకు 1,646 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 1,561 మందికి 1,433 మంది హాజరు కాగా, 128 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 231 మందికి 18మంది గైర్హాజయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షకు 923 మందికి 880 మంది విద్యార్థులు హాజరు కాగా, 43 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 730 మందికి 35మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 193 మంది విద్యార్థులకు ఏడుగురు గైర్హాజరయ్యారు.

నేడు శనైశ్వరాలయంలో...
ప్రత్యేక పూజలు



మోమిన్‌పేట్, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్కతల గ్రామంలో వెలిసిన శ్రీ శనైశ్వరస్వామి ఆలయంలో సోమవారం(నేడు) అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. బహుళ అమావాస్య, శ్రీ శనైశ్వర స్వామి జయంతి సందర్భంగా పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తాగునీటిలో మురుగు!

- వికారాబాద్‌లో మిషన్ భగీరథ నీరు కలుషితం
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- మురుగు పారిన ఇంద్రానగర్
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- తరచూ ఇదే సమస్య


ఇంద్రానగర్ కాలనీ అంతర్గత రోడ్డులో పారుతున్న మురుగుతో కూడిన నల్లా నీరు

వికారాబాద్, మే 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల్లో ఒకటి మిషన్ భగీరథ. ఆ నీటిని తాగాలని పాలకులు, అధికారులు ఊదరగొట్టేస్తుంటారు. మినరల్ వాటర్ ప్లాంట్ నీటిని తాగితే కీళ్ల నొప్పులొస్తాయని, మిషన్ భగీరథ నీటిలో మినరల్స్ పుష్కిగా ఉండి ఆరోగ్యానికి మేలు చేస్తాయని పేర్కొంటుంటారు. అయితే మాటలు ఒకటి.. చేతలు ఒకటి అన్నట్లుగా అధికారుల తీరు ఉంది. వికారాబాద్‌లో మిషన్ భగీరథ నీటికి బదులు డ్రైనేజీ నీటిని సరఫరా చేస్తున్నారు. మునిసిపాలిటీ పరిధి ఇంద్రానగర్‌లో ఆదివారం డ్రైనేజీ నీరు సరఫరా అయి ఆ కాలనీ దుర్గంధభరితంగా మారింది.

పట్టణంలో 34 వార్డులు

వికారాబాద్ పట్టణంలో 34 వార్డులు, లక్షకు పైగా జనాభా ఉంది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. గతంలో సాటిలైట్ సిటీలో భాగంగా మంజూరైన నిధులతో ముందుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులు చేపట్టారు. అయితే యూజీడీ పనుల్లో నాయకుల చేతివాటంతో అప్పటి కాంట్రాక్టర్ నాణ్యతా లేకుండా పనులు చేసి చేతులు దులుపుకున్నారని పలు సందర్భాల్లో కౌన్సిల్ సమావేశంలో ఆరోపించారు. ఆ పనులు ఇప్పుడు పట్టణానికి శాపంగా మారాయి. ఎక్కడపడితే అక్కడ డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. డ్రైనేజీల పక్కనే తాగునీటి సరఫరా పైపులైన్ ఉండడంతో మురుగు నీటితో కలుషితమవుతోంది.

బిల్లులు లేపడం.. మమ అనిపించడం...

మునిసిపల్ అధికారుల పనిసైతం డ్రైనేజీ పనులకు, వాటిని శుభ్రం చేసే మిషన్ల కోసం ఏ చిన్న సమస్య వచ్చిన బిల్లులు లేపడం మమ అన్నట్లుగా పనులు చేస్తున్నారు. వారం తిరుగక ముందే మళ్లీ అదే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మునిసిపల్ అధికారులు ఎవరికి వారే యమునా తీరే

మిగతా 8వ పేజీలో...

రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తా

మునిసిపల్ పరిధి 18వ వార్డులో తాగునీరు డ్రైనేజీ నీటితో కలుషితమైనట్లు నా దృష్టికి వచ్చింది. సోమవారం ఫీల్డ్‌కు వెళ్లి పరిశీలిస్తా. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటా. డ్రైనేజీ వల్ల నీటి కలుషితం అయినట్లుగా తెలుస్తోంది. డ్రైనేజీలో మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటాం.

- రాకేశ్‌రెడ్డి, మునిసిపల్ డీఈ, వికారాబాద్

గ్రామ పాలన అధికారుల పరీక్ష ప్రశాంతం

- వికారాబాద్‌లో 143 మంది, మేడ్చల్‌లో 52 మంది హాజరు


పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలన అధికారి పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. వికారాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో గ్రామ పాలన అధికారి పరీక్షను నిర్వహించామన్నారు. ఈ పరీక్షకు 150 మంది అభ్యర్థులకు గాను 143 మంది అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. ముందుగా జిల్లా కలెక్టర్ ప్రశ్నపత్రాలను సంబంధిత అధికారుల సమక్షంలో సీల్ ఓపెన్ చేశారు. కలెక్టర్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీటీడీవో కమలాకర్‌రెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఈ-సెక్షన్ సూపరింటెండెంట్ నేహమత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లాలో..

మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నిర్వహించిన గ్రామ పరిపాలన అధికారుల పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కూకట్‌పల్లిలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. పరీక్ష ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థుల వివరాలను, ఇతర ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. మొత్త 52 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద 144సెక్షన్ విధించి బందోబస్తును ఏర్పాటు చేశారు


పరీక్ష కేంద్రం వద్ద పరిశీలిస్తున్న అధికారి విజయేందర్‌రెడ్డి


గట్టెపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కొనుగోలు చేసిన ధాన్యాన్ని
తక్షణమే తరలించండి

ధారూరు, మే 25(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని తక్షణమే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. మండల పరిధిలోని గట్టెపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సాయంత్రం ఆయన సందర్శించి కొనుగోళ్ల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని ఆయన చెప్పారు. లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తిచేయాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. కాగా ధాన్యం కొనుగోళ్లపై అక్కడ ఉన్న రైతులతో అధికారి మాట్లాడారు.

మహదేవ శివాలయంలో రుద్రాభిషేకం


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కొడంగల్, మే 25(ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణంలోని మహదేవ శివాయంలో ఆదివారం మాస శివరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో లింగాష్టక పారాయణం చేసి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర, సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు, మాణికేశ మహాసంస్థాన్ పీఠాధిపతి శంకర్‌స్వామిజీ ఆధ్వర్యంలో పార్వతీమాతకు 201మంది మహిళలతో సామూహిక కుంకుమ అర్చన నిర్వహించారు. లక్ష విగ్రహాల పంపిణీ లక్ష్యంతో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ సొంత డబ్బులతో తయారు చేసిన మహాలక్ష్మి అమ్మవారి విగ్రహాలను కుంకుమార్చన అనంతరం మహిళలకు అందించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశం సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయమని, భారతీయులందరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు నారాయణ, రవికిరణ్, పుండరీకం, వెంకటయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కొడంగల్ వీహెచ్‌పీ, హిందూ వాహిని సభ్యులు పాల్గొన్నారు

భారీ వర్షం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

యాలాల, మే 25(ఆంధ్రజ్యోతి): యాలాల మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. అధికారులు సకాలంలో గోనె సంచులు, లారీలు సరఫరా చేయకపోవడంతోనే కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆవేదన చెందారు.


బెన్నూరులో నీటిలో మునిగిన ధాన్యం బస్తాలు

ప్రమాదకరంగా కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు వంతెన

- బ్రిడ్జి దిగువన ఒక వైపు కూలిన రాతి గోడ


కట్టురాళ్లు కొట్టుకుపోయి శిథిలమైన అలుగు వంతెన దిగువ భాగం

ధారూరు, మే 25(ఆంధ్రజ్యోతి):కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు వంతెన దిగువన ఓ వైపు రాతిగోడ కూలి ప్రమాదకరంగా మారింది. మండల పరిధిలోని రుద్రారం-నాగసమందర్ గ్రామాల మధ్య ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు వంతెన భారీ వర్షా లకు 2016లో కొట్టుకుపోయింది. ఆ తర్వాత ఈ వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలకు సౌకర్యంగా చేశారు. అయితే ప్రస్తుతం వంతెన దిగువ భాగాన రాతిగోడ నుంచి కొన్ని రాళ్లు ఊడిపోయి రంధ్రం ఏర్పడి ఒక వైపు వంతెన దెబ్బతింది. రానున్న వర్షాకాలంలో ప్రాజెక్టు అలుగు నీరు ఉధృతంగా ప్రవహిస్తే బలహీనంగా మారిన ఈ బ్రిడ్జి కొట్టుకుపోయే ప్రమాదం నెలకొంది. అంతేకాక భారీ వాహనాలు వంతెన రాతి గోడ కూలిన చోటి నుంచి ప్రయాణిస్తే వాహనాల బరువుకు వంతెన కూలి వాహనాలు అలుగులో పడే ఆస్కారం కూడా ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. దెబ్బతిన్న వంతెనకు రిపేరు చేయించాలని బ్రిడ్జి పరిసర గ్రామాల ప్రజలు, వాహనదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆంజనేయులు

పేద కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే

కులకచర్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అండగా ఉంటారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్‌లో ఆదివారం కిన్నెర రాములమ్మ(60) అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్పందించారు. తాను అందుబాటులో లేకపోవడంతో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పంపించిన ఆర్థిక సాయాన్ని రూ.5వేలు మృతురాలి కుటుంబానికి అందజేశారు. పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమయ్య, చంద్రయ్య, భాస్కర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత

కులకచర్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రైతు వేదికలో సోమవారం జరిగే సమావేశంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రొసీడింగ్స్ అందజేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 32 గ్రామపంచాయతీలకు మొదటి విడతలో 391ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో రెండో విడతలో కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

వసూళ్లకు పాల్పడుతూ.. ఫొటోలకు పోజులు!

- మున్సిపాలిటీని దత్తత తీసుకొని దగా చేశారు
- అభివృద్ధి అంటే ఎందో చేసి చూపిస్తా
- బీఆర్ఎస్ నాయకులపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆగ్రహం



ఎమ్మెల్యే శంకర్‌ను సన్మానించిన కౌన్సిలర్ హేమాదేవేందర్‌ముదిరాజ్

కొత్తూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు పరిశ్రమల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ, ఫొటోలకు ఫోజులు ఇస్తే అభివృద్ధి ఎలా జరుగుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మున్సిపాలిటీలోని 6వ వార్డులో విద్యుత్ టవర్ ప్రారంభంతో పాటు, పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కాగా, 6వ వార్డులో 20ఏళ్లుగా ఇళ్ల మీద నుంచి వెళ్లిన విద్యుత్ తీగలతో కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. విద్యుత్ షాక్‌కు గురై పలువురు మృత్యువాత కూడా పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే శంకర్ కృషి ఫలితంగా అధికారులు విద్యుత్తీగలను తొలగించి, కాలనీవాసులకు విముక్తి కలిగించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వీరమోని హేమ దేవేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శంకర్‌కు కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కొత్తూర్ మున్సిపాలిటీని దత్తత తీసుకొని దగా చేసి, ప్రజలకు మొండిచెయ్యి చూపారని దుయ్యబట్టారు. మున్సిపాలిటీ అభివృద్ధి ఎందో మేము ఏడాదిలోపే చేసి చూపిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తూర్ మున్సిపాలిటీ రూపు రేఖలు మార్చామని అన్నారు. కోట్లాది రుపాయలు వెచ్చించి ప్రధాన రహదారిని నిర్మించి, బట్టర్‌ఫ్లై లైట్లు, సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణాలు చేపట్టి ప్రజల సమస్యలను దూరం చేశామని గుర్తుచేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు బీఆర్ఎస్ నాయకులు అడ్డువస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎమ్మెల్యే హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులకు పని లేనందున చీటికీమాటికీ పాపిరస్‌పోర్టు రిసార్టులో విలేఖరుల సమావేశం ఏర్పాటుచేసి ఇష్టమొచ్చినట్లు కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, ఇకముందు అలా జరిగితే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసి వస్తే స్వాగతిస్తామని, అడ్డు తగిలితే ప్రజలే బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమాల్లో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, కౌన్సిలర్ జయమ్మ జనార్ధన్‌చారి, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ, మండల అధ్యక్షులు జె.సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహ, మాజీ సర్పంచులు జెనిగె జగన్, అంబటి ప్రభాకర్, నాయకులు మామిడి సిద్ధార్థరెడ్డి, ఇందారి శ్రీనివాస్, కర్రోళ్ల సురేందర్, నవీన్‌చారి, చిల్కమర్రి నర్సింహా, మహేష్‌గౌడ్, మధురాపురం బాల్‌రాజ్‌గౌడ్, కొమ్ము కృష్ణ, కుమారస్వామిగౌడ్, చంద్రపాల్‌రెడ్డి, గోవింద్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అల్లుకుపోతున్న విద్యుత్‌వైర్లు

- షార్ట్‌సర్క్యూట్‌తో కాలుతున్న పంపుసెట్లు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



ట్రాన్స్‌ఫార్మర్‌కు ఒకే స్తంభం నుంచి వస్తూ అల్లుకుపోతున్న హెచ్‌టీ, ఎల్టీ లైన్లు

షాద్‌నగర్ అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి విద్యుత్తు సరఫరా కోసం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చే హైటెన్షన్ (హెచ్‌టీ), లోటెన్షన్(ఎల్టీ)వైర్లు ఒకే స్తంభానికి ఉండడంతో గాలివస్తే అల్లుకుపోయి, షార్ట్‌సర్క్యూట్ వల్ల పంపుసెట్లు కాలిపోతున్నాయని ఫరూఖ్‌నగర్ మండలంలోని రామేశ్వరం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామేశ్వరం గ్రామ పంచాయతీలోని శ్మశానవాటిక పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చే హెచ్‌టీ, ఎల్టీ వైర్లు చిన్నపాటి గాలివస్తే అల్లుకుపోయి, మంటలు వస్తున్నాయని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ సమయంలో పనిచేస్తున్న విద్యుత్తు పంపుసెట్లు తరచూ కాలిపోతున్నాయని తెలిపారు. ఒకే స్తంభం నుంచి హెచ్‌టీ, ఎల్టీ వైర్లను ట్రాన్స్‌ఫార్మర్‌కు తేవడం, అవి వేలాడి ఉండడంతో గాలి దుమారానికి అల్లుకుపోతున్నాయని రైతులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కేబుల్‌వైర్లు కూడా పూర్తిగా కాలిపోయి, అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్తు సిబ్బందికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తును ఇస్తున్నామన్న భావనతో రైతుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని, షార్ట్‌సర్క్యూట్‌తో జరగరాని ప్రమాదం జరిగితే విద్యుత్తు సిబ్బంది బాధ్యత వహించాలని రైతులు హెచ్చరిస్తున్నారు.

చెప్పినా పట్టించుకోవడం లేదు



వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గాలివానలకు హెచ్‌టీ, ఎల్టీ వైర్లు అల్లుకుపోయి మంటలు వస్తూ, విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. విద్యుత్తు పంపుసెట్లు కూడా కాలిపోతున్నాయి. ట్రాన్స్‌పార్మర్‌కు వచ్చే వైర్లను సెపరేట్ చేసి, కేబుల్ వైర్లను మార్చాలని పలుమార్లు లైన్‌మ్యాన్‌కు చెప్పాను. వైర్లను సరిచేయకపోవడంతో తాను కూడా నష్టపోతున్నా.

సంపత్, మాజీ సర్పంచ్,రామేశ్వరం

భూమిక మృతదేహం అప్పగింతకు నిరాకరణ

- ఈనెల 21న అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి
- ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా ఆస్పత్రికి వెళ్లిన మావోయిస్టు భూమిక తండ్రి, బంధువులు
- డెడ్‌బాడీని ఇవ్వడానికి నిరాకరించిన అక్కడి పోలీసులు

కేశంపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మవోయిస్టు భూమిక అలియాస్ వన్నాడ విజయలక్ష్మి(38) మృతదేహం అప్పగించేందుకు ఛత్తీస్‌గఢ్ పోలీసులు నిరాకరించారు. ఈమేరకు ఆదివారం ఆమె బంధువులు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం వేముల్‌నర్వ గ్రామానికి చెందిన వన్నాడసాయిలు చిన్న కూతురు భూమిక ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌లోని ఓయూలో పీజీ పొలిటికల్ సైన్స్‌లో చేరింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొంది. ఈక్రమంలో 2013-14 మధ్య అజ్ఞాతంలోకి వెళ్లిన ఆమె ఈనెల 21న ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్‌లో పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన విషయం విధితమే. అయితే, ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన భూమిక మృతదేహాన్ని తీసుకురావడానికి ఆమె తండ్రి సాయిలుతో పాటు సమీప బంధువులు మృతదేహాలను భద్రపరిచిన ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి పోలీసులను సంప్రదించగా వారు కేశంపేట పోలీసుల నుంచి వివరాలు సేకరించారు. అయితే, భూమిక మృతదేహం ఇవ్వడానికి అక్కడి పోలీసులు నిరాకరిస్తున్నారని సాయిలు, బంధువులు తెలిపారు. ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని వారు తెలిపారు.

మృతదేహం అప్పగిస్తే..

నేడు గ్రామానికి..

కాగా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు అక్కడ అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసి భూమిక మృతదేహం ఇస్తే నేడు(సోమవారం) గ్రామానికి చేరుకునే అవకాశం ఉంది. అయితే, పోలీసులు మృతదేహాన్ని ఇవ్వడానికి నిరాకరిస్తే మరుసటి రోజు అంటే రేపు(మంగళవారం) గ్రామానికి పంపించనున్నట్లు సమాచారం.



నారాయణపూర్ జిల్లా ఆసుపత్రి

ఎమ్మెల్యేను కలిసిన మాజీ ప్రజాప్రతినిధులు



ఎమ్మెల్యేతో అల్లాపూర్‌కు చెందిన మాజీ నేతలు

తాండూరు రూరల్, మే 25, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పలువురు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం కలిసి గ్రామసమస్యల గురించి వివరించారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్యకేంద్రం, ఎస్సీకాలనీ, మురుగుకాల్వలు, సీసీరోడ్లు సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ ఉపసర్పంచ్ యాదయ్యగౌడ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, ప్రశాంత్‌గౌడ్, బి.రమేశ్, శ్రవణ్‌గౌడ్, మోహన్‌రాథోడ్, నారాయణచారి, కాంగ్రెస్ యువ నాయకులు ఉన్నారు.

అంబేడ్కర్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

ఘట్‌కేసర్, మే25 (ఆంధ్రజ్యోతి): యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధి మీసాల అరుణ్ కుమార్, అర్జున్ అన్నారు. అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో అసమానతలు రూపుమాపడానికి అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో దాసు, రాందాస్, లలిత్, సత్యం, రాజేష్, వెంకటేశ్వర్లు, గణేష్, జగదీష్ శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ధ్యేయం

శంకర్‌పల్లి/షాద్‌నగర్‌రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ తెలిపారు. మహారాజ్‌పేట్, అంతప్పగూడ, పొన్నగుట్ట తండాలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్లకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఇందిరమ్మఇళ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర నాయకుడు ఉదయ్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రవిందర్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మైసయ్య, శ్రీనాథ్‌గౌడ్, కృష్ణారెడ్డి, పెంటయ్య, కిష్టయ్య పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పేదల కళ్లలో ఆనందం కనబడుతోందని కాంగ్రెస్‌పార్టీ ఫరూఖ్‌నగర్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వెలిజర్ల, లింగారెడ్డిగూడలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజలు చేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇల్లు మంజూరవుతుందని, ఎమ్మెల్యే పేదలందరికీ సమన్యాయం చేస్తారని తెలిపారు. ఈసందర్భంగా ప్రొసీడింగ్స్ అందించారు. నర్సింహరెడ్డి, అశోక్, బాల్‌రాజ్, జాంగారిరవి, నర్సింహులు ఉన్నారు.



అంతప్పగూడలో ప్రొసీడింగ్స్ అందిస్తున్న భీంభరత్



నియామకపత్రాలు అందజేస్తున్న యాస్కి శిరీష

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం

- బీజేపీ పట్టణ అధ్యక్షురాలు శిరీష

వికారాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పార్టీ పటిష్టతకు కృషి చేయనున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షురాలు శిరీష తెలిపారు. వికారాబాద్ నూతన కార్యవర్గ నియామకపత్రాలను పట్టణ ప్రభారి పాండుగౌడ్‌కు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతీఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మాదవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శివరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాండుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, వివేకానందారెడ్డి, పోకల సతీష్, రాములు, చరణ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో జాప్యం

● కొడంగల్-తాండూర్ మార్గంలో నత్తనడకన సాగుతున్న పనులు



కొడంగల్-తాండూర్ మార్గంలో కంకర వేసి వదిలేసిన దృశ్యం

కొడంగల్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి కొడంగల్ మీదుగా కర్ణాటక రాష్ట్రం చించోలి వరకు కొనసాగుతున్న రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. రెండు సంవత్సరాల కిందట నిధులు మంజూరు కాగా పనులు మాత్రం నత్తనడకన కొనసాగుతున్నాయి. ప్రధానంగా కొడంగల్ నుంచి తాండూరు వరకు రోడ్డు పనుల్లో జాప్యం జరగడంతో వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో కంకర వేసి నెలలు గడుస్తోంది. రోడ్డు అభివృద్ధి పనుల్లో ఎరన్‌పల్లి, తిమ్మాయిపల్లి గేటు, దౌలాపూర్ వద్ద కల్వర్టుల నిర్మాణం అసంపూర్తిగా మారాయి. రోడ్డు పనులు చేపట్టే క్రమంలో కనీసం రోడ్డుపై నీళ్లు చల్లకపోవడంతో వాహనదారులు దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మార్గంలో కల్వర్టుల నిర్మాణంలో జాప్యం కారణంగా తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ భూపాల్‌శ్రీధర్

చేవెళ్ల, మే 25(ఆంధ్రజ్యోతి): పండుగలను ప్రజలందరూ శాంతియుతంగా జరుపుకోవాలని చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్ తెలిపారు. ఆదివారం చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో బక్రీద్ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని, రాజకీయ నాయకులు ఎలాంటి గొడవలకు తావులేకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. సమావేశంలో ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, శిరీష, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రికార్డులు నెలకొల్పాలి

● మొబైల్స్‌కు దూరంగా ఉండాలి

● అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్

● మేడ్చల్ జిల్లా సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ క్రీడాపోటీలు



క్రీడాపోటీల్లో గెలుపొందిన బాలబాలికలతో రాజశేఖర్

శామీర్‌పేట, మే 25(ఆంధ్రజ్యోతి): బాలబాలిక విద్యార్థులు, క్రీడాకారులు మొబైల్స్‌కు దూరంగా ఉండాలి, క్రీడాపోటీల్లో పాల్గొని రికార్డులను నెలకొల్పాలి అని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ పిలుపు నిచ్చారు. ఆదివారం తూంకుంట పరిధిలోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ గ్రౌండ్స్‌లో రాజశేఖర్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లాస్థాయి సబ్ జూనియర్ సెలక్షన్స్ ట్రయల్స్ అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల పాఠశాలలకు చెందిన 80మంది బాలబాలికల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నారు. అండర్-8, 10, 12ఏజ్ గ్రూప్ బాలలు పరుగు పందెం, షాట్‌పుట్, జావలిన్ త్రో, లాంగ్ జంప్ తదితర అథ్లెటిక్స్ ఈవెంట్లలో తలపడ్డారు. ఈ అథ్లెటిక్స్ సెలక్షన్స్ ట్రయల్స్‌లో 20 మంది బాలబాలికల ఉత్తమ ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. జూన్ 1న సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ క్రీడాపోటీలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ దయాల్, టెక్నికల్ కమిటీ సభ్యులు తిరుమలరావు, వివిధ పాఠశాలలకు చెందిన పది మంది పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

నిరుపయోగంగా 'చెత్త' రిక్షా



కొడంగల్ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం లక్షలు వెచ్చించి పంచాయతీలకు అందించిన చెత్త సేకరణ రిక్షాలు నిరుపయోగంగా మారాయి. మండలంలోని ప్యాలమద్ది గ్రామంలో పెంటకుప్ప పక్కనే చెత్తసేకరణ రిక్షాను వదిలేశారు. చిన్నపాటి మరమ్మతులు చేయిస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో పంచాయతీలకు చెత్తసేకరణకు ట్రాక్టర్లను కేటాయించినప్పటికీ ఇంధనం ఉంటేనే బండి కదిలే పరిస్థితి నెలకొంది. రిక్షాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు!

(ఐదో పేజీ తరువాయి)

నిర్మించాలని భావిస్తున్నా సాధ్యపడటం లేదు. ప్రభుత్వానికి ఆదాయం వచ్చే రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను తొలి విడతలో నిర్మించాలని యోచించినా ఆచరణ యోగ్యం కావడం లేదు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సంబంధించి ఏళ్ల తరబడి అద్దె పేరుకుపోయింది. అద్దెలు భారమవుతున్నా, సమస్యలతో తాండవం చేస్తున్నా వీటి నిర్మాణాల గురించి అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు గాను స్థలాలు కూడ సేకరించారు. సొంత భవనాలు ఉన్నవాటిని ఆధునికీకరించాలనుకున్నారు. రాష్ట్రంలో 144 సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులున్నాయి. వీటిలో 38 మాత్రమే సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. రంగారెడ్డి రిజిస్ట్రార్ పరిధిలో 22 సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. అందులో జిల్లా సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం కూడా అద్దె భవనంలోనే కొనసాగడం గమనార్హం. రంగారెడ్డి జిల్లాలో 18, వికారాబాద్ జిల్లాలో నాలుగు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కొడంగల్ సబ్‌రిజిస్ట్రార్ మినహా మిగతావి అద్దె భవనల్లో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లకు వచ్చే వారికి కనీసం కూర్చొనే వీలు కూడా లేకపోవడంతో చెట్ల కింద, నీడ దొరికిన చోట సర్దుకుపోతున్నారు. సీజన్లలో కార్యాలయాలు కిక్కిరిసిపోతున్నాయి. కనీసం అక్కడ కూర్చునే పరిస్థితి కూడా లేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేవరకు కార్యాలయంలో నిలబడే ఉండాల్సి వస్తుంది.

అరకొర వసతులతో అద్దె భవనాల్లోనే..

నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పక్కా భవనాలు లేవు. అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ కార్యాలయాల్లో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కలెక్టరేట్, ఔటర్ రింగ్‌రోడ్డు, ఫార్మాసిటీ, పరిశ్రమలు ఉండటంతో ఇక్కడ భూములకు మంచి డిమాండ్ ఉంది. దీంతో ఈ ప్రాంతంలో భూముల క్రయ విక్రయాలు ఎక్కువగా జరిగి రిజిస్ట్రేషన్ల కోసం అనేక మంది వస్తుంటారు. వీరందరికీ అద్దె భవనంలో కొనసాగే కార్యాలయాల్లో సరైన తాగునీటి వసతి, మూత్రశాలలు లేక అవస్థ పడుతున్నారు. పార్కింగ్ సౌకర్యం కూడా లేక రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. చేవెళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించేందుకు కోర్టు పక్కన అనుకుని స్థలం కేటాయించారు. గత 11 సంవత్సరాల క్రితం రూ.62 లక్షలు మంజూరి చేశారు. పక్కా భవన నిర్మించేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాక పోవడంతో నిధులు వెనక్కి పోయాయి. ప్రస్తుతం అయ్యప్ప స్వామి దేవాలయం పక్కన అద్దె భవనంలో కొనసాగుతోంది. కనీస సౌకర్యాలు కొరవడ్డాయి. శంకర్‌పల్లి, గండిపేట్, ఫరూక్‌నగర్, చంపాపేట్, పెద్ద అంబర్‌పేట్, వనస్థలిపురం, సరూర్‌నగర్, శంషాబాద్, అబ్దుల్లాపూర్‌మెట్, వికారాబాద్, పరిగి, తాండూరులో సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అద్దె భవనంలో అవస్థల నడుమ కొనసాగుతున్నాయి. షాద్‌నగర్ పట్టణంలోని నాగులపల్లి రోడ్డులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణం కోసం 2019లో ప్రభుత్వం 10 గుంటల భూమిని కేటాయించింది. దీనికి అప్పటి హోంమంత్రి మహమూద్ అలీ శంకుస్థాపన చేశారు. కానీ నేటి వరకు ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్ట లేదు. ప్రస్తుతం ఈ స్థలం సమీపంలో ఉన్న ఫంక్షన్ హాల్‌కు పార్కింగ్ స్థలంగా మారింది. 1996లో ఏర్పాటైన రాజేంద్రనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నేటికీ అద్దె భవనంలోనే కొనసాగుతోంది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 12 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉండగా వాటిలో నాలుగిటికి మాత్రమే సొంత భవనాలున్నాయి. మిగిలినవి అరకొర సౌకర్యాల నడుమ అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిటి ప్రతీనెల లక్షల్లో అద్దె రూపంలో ఖర్చు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే స్థలాలు చూసినప్పటికీ భవన నిర్మాణాలకు అవసరమైన నిధులు లేకపోవడంతో ప్రక్రియ అక్కడే నిలిచిపోయింది.



చేవెళ్లలో అద్దె భవనంలో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయం



షాద్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించేందుకు కేటాయించిన స్థలం ఇదే

ఆరుబయటే వేచి ఉండాలి



ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏళ్ల తరబడిగా అద్దె భవనంలో కొనసాగుతుంది. ఇరుకు గదుల్లో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. కార్యాలయానికి వచ్చేవారికి కనీస సౌకర్యాలు లేవు. కనీసం వేచి ఉండడానికి గదులులేక ఆరుబయటే ఉండాల్సి వస్తోంది. తాగునీరు, టాయిలెట్ వసతి కూడా లేదు. ముఖ్యంగా మహిళలు మరీ ఇబ్బంది పడుతున్నారు. పార్కింగ్ సౌకర్యం లేక రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. ఈ దారిగుండా వెళ్లేవారికి ఇబ్బంది తప్పడం లేదు. ప్రభుత్వాలకు ఆదాయ వనరు అయినప్పటికీ ఈ కార్యాలయాలపై చిన్నచూపెందుకో అర్థం కావడం లేదు.

- ఏనుగు భరత్‌రెడ్డి, తుర్కగూడ, ఇబ్రహీంపట్నం మండలం

ఇంటి నిర్మాణానికి వెనకడుగు

● ఇందిరమ్మ ఇళ్లు మంజూరై రెండు నెలలు పూర్తి

● ఊపందుకోని నిర్మాణ పనులు

● బిల్లుల మంజూరీపై లబ్ధిదారుల సందేహం

● భరోసా కల్పిస్తేనే నిర్మాణాలు పూర్తయ్యే అవకాశం

బషీరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరై దాదాపు రెండు నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు ఊపందుకోవడం లేదు. ఇళ్లు మంజూరైందనే సంతోషం లబ్ధిదారుల్లో ఉన్నా ఆర్థిక లేమితో నిరుపేద లబ్ధిదారులు కట్టుకునేందుకు వెనకడుగు వేస్తున్నారు.దీంతో ఆశించిన స్థాయిలో ఇళ్ల నిర్మాణాలు జరగకపోగా, పేదల సొంతింటి కలను నిజం చేయాలనే ప్రభుత్వ లక్ష్యం నేరవేరడంలేదు.

లబ్ధిదారుల్లో అనాసక్తి

బషీరాబాద్ మండలంలో కాశీంపూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం తొలి విడత ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసింది. గ్రామంలో 193 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. దరఖాస్తు సమయంలో ఆసక్తి చూపిన ప్రజలు ఇళ్లు మంజూరయ్యాక నిర్మాణంపై అనాసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటి వరకు 17వరకు ఇళ్ల బేస్‌మెంట్ పూర్తికాగా, మిగతా 53 ఇళ్లు ప్రారంభదశలో ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. నిబంధనల ప్రకారం పునాది తీసిన తర్వాత యాప్ సాయంతో ఇంటి నిర్మాణం స్థితిని అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తారు. అప్పుడే లబ్ధిదారుల ఖాతాలో రూ.లక్ష జమవుతుంది. మిగతా డబ్బులు కూడా మూడు విడతల్లో జమవుతాయి. ఇదిలా ఉండగా పునాది దశ వరకు అయ్యే రూ.లక్ష ఎక్కడి నుంచి తేవాలని కొందరు పేదలు వాపోతున్నారు. అంత డబ్బులేకనే శిథిలావస్థలో ఉన్న ఇంట్లో ఇన్నిరోజులు కాలం వెళ్లదీశామని చెబుతున్నారు.



కాశీంపూర్‌లో బేస్‌మెంట్ స్థాయిలో ఇంటి నిర్మాణం



కాశీంపూర్‌లో ఇంటి నిర్మాణానికి ముగ్గు వేసిన దృశ్యం

బిల్లులు సకాలంలో రాకుంటే పరిస్థితి ఏంటి?

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అప్పులుచేసి నిర్మించుకుందామన్నా బిల్లువస్తుందో రాదోననే సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి బిల్లులు సకాలంలో రాకుంటే పరిస్థితి ఎంటి? అనే సందేహంలో కొందరు లబ్ధిదారులు సతమతమవుతున్నారు. నిర్మాణం వ్యయం, స్టీల్, సిమెంట్ ధరలు భారీగా పెరగడంతో ఏం చేయాలో తేచక పలువురు ఇళ్ల నిర్మాణం జోలికి వెళ్లడంలేదు. ఇళ్లు మంజూరైనా మరి కొందరు పెట్టుబడి పెట్టే స్థోమత లేక, స్థలాల కొరతతో ఇళ్లు కట్టుకోవాలనే ఆలోచన కూడా చేయకపోవడం గమనార్హం.

భరోసా ఏది?

ఇళ్ల నిర్మాణం చేపడితే యాప్ ద్వారా దశల వారీగా ఫొటోలు తీసి పంపిస్తే బిల్లులు వస్తాయని, ఇందులో అవకతవకలకు తావులేదని అధికారులు చెబుతున్నా లబ్ధిదారులకు భరోసా కలగడంలేదు. ఒకరిద్దరికి బేస్‌మెంట్ బిల్లులు వస్తే తప్పా ఇంటి నిర్మాణాలపై కొందరు ఆసక్తి చూసే అవకాశం ఉంది. గ్రామంలో ఒకరికి బేస్‌మెంట్ బిల్లు రూ.లక్ష మంజూరైందని, మిగతా ఆరుగురికి కూడా త్వరలో బిల్లులు వస్తాయని గ్రామ కార్యదర్శి అశోక్ చెప్పుకొచ్చారు. హౌసింగ్ అధికారులు బిల్లుల చెల్లింపు విషయమై లబ్ధిదారులకుపూర్తి భరోసా కల్పిస్తే తప్పా ఇంటి నిర్మాణాలు పుంజుకునే అవకాశం కనిపించడంలేదు.



పాఠశాల భవనంపై విద్యుత్ హైటెన్షన్ తీగలు

పొంచి ఉన్న ప్రమాదం!

దుద్యాల, మే 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న చెట్లపై, బోర్డుపై విద్యుత్ తీగలు కిందికి వేలాడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా పాఠశాల మైదానం మీదుగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ హైటెన్షన్ తీగల ప్రాంతంలో పోలీస్‌స్టేషన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, విద్యావనరుల కేంద్రం ఉన్నాయి. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ హైటెన్షన్ తీగలను తొలగించి మరొక ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రమాదం జరగకముందే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మందుబాబులకు అడ్డాగా..

దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, విద్యావనరుల కేంద్రం ఆవరణ, క్రీడా మైదానంలో విద్యుత్ దీపాలు, సీసీకెమెరాలు లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. మద్యం తాగి సీసాలను అక్కడే పడేస్తున్నారు. పాఠశాల సమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి సెలవులు ఉండటంతో వారికి అడ్డూఅదుపు లేకుండా పోయిందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా క్రీడామైదానంలో హైమాస్ట్ లైట్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఆకతాయిలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం



25 ఏఎమ్ఎల్ 4: మాట్లాడుతున్న గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, మే 25(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కాంగ్రెస్ సర్కార్ నిరుపేదలను తీవ్ర అన్యాయానికి గురిచేసిందని కడ్తాల మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో రెండు, మూడు విడతల్లో సుమారు 1600 కుటుంబాలు ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకోగా.. కేవలం 60 మందిని మాత్రమే ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కొరకు దరఖాస్తు చేసుకోగా.. తిరస్కరణకు గురైన వారి వివరాలు, కారణాలు వెంటనే గ్రామ పంచాయతీల వారిగా బహిర్గతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాబోవు స్థానిక ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టేందుకు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మరోసారి నాటకానికి తెరలేపిందన్నారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేరలేదన్నారు. రూ.2 లక్షలతోపు రుణమాఫీ సగం మందికి కూడా కాలేదని, రైతు భరోసా ఇంత వరకు అందించకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు లాయక్‌అలీ, రామచంద్రయ్య, ఇర్షాద్, వెంకటేశ్, నాగార్జున, మహేశ్, కృష్ణ, భాష్కర్, మహేశ్ నాయక్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృత్యువాత



మృతి చెందిన జింక

కందుకూరు, మే 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి(కొత్తూరు గేటు) పెద్దమ్మ గుడి సమీపంలో జింక రోడ్డు దాటుతుండగా ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఫారెస్టు సెక్షన్ అధికారి విజయభాస్కర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే జింక మృతి చెందిందని ఆయన తెలిపారు. మృతిచెందింది మగ జింక అని చెప్పారు. వెంటనే సమీపంలోని రాచులూరు పశువైద్యశాలకు తరలించారు. పశువైద్యాధికారి షాహిన్ షేక్ సిబ్బందితో కలిసి మృతి చెందిన జింకకు పోస్టుమార్టం చేశారు. అనంతరం జింకను ఖననం చేశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ షాహిన్‌షేక్‌లు మాట్లాడారు. లేమూరు పడమటి కంచలో సుమారు 5 జింకలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి మహేశ్వరం మండలంలో మహబ్బత్‌నగర్ గేటు నుంచి లేమూరు పడమటి కంచ ఫారెస్టు ఉందని, అక్కడ వాహనాలను అతివేగంగా నడపరాదని వారు సూచించారు.



వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో ఎంపీ రాజేందర్

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

మేడ్చల్ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకలను విష్ణుశౌర్య ఆధ్వర్యంలో ఆదివారం మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో నిర్వహించగా భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. మాల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేదల జీవన ప్రమాణాల పెంపే ధ్యేయం

● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, మే 25(ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థికార్థిభివృద్ధి, పేదల జీవన ప్రమాణాల పెంపే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన దక్షతతో ఏడాదిన్నర కాలంలో రాష్ట్రం అద్భుత విజయాలు సాధించి సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కసిరెడ్డి పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరైన ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రజాబలం ముందు స్వార్థ శక్తుల కుట్రలు ఫలించవన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం రాష్ట్రంలో విపక్షాలు ఉనికి లేకుండా పోతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నట్లు నారాయణ రెడ్డి చెప్పారు. నియోజకవర్గంలో రూ.500 కోట్లతో రోడ్ల ఆధునీకరణ, నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, యాదయ్య, సీత పెద్దయ్య, విజయ్‌రాథోడ్, రవీందర్, బాబా తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తాగునీటిలో మురుగు!

(ఐదో పేజీ తరువాయి)

అన్నట్లుగా మారింది తప్ప ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులంటున్నారు. ఏ అధికారి వచ్చినా వారి స్వలాభం కోసం పనులు చేయడం తప్ప ప్రజలకు ఉపయోగపడేలా పను లు చేయడం లేదని విమర్శలొస్తున్నాయి.

కంపు కొడుతున్న ఇందిరానగర్

వికారాబాద్‌లోని ఇంద్రానగర్ ఆదివారం నిద్ర లేవడం తోనే డ్రైనేజీ నీటితో కంపుకొట్టింది. ఇండ్లలో నిద్రపోయే వారు సైతం ఆ వాసనను భరించలేని పరిస్థితుల్లో సతమతమయ్యారు. ఏమైంది.. ఈ వాసన ఏంటీ? అని మాట్లాడుకున్నారు. భరించలేని దుర్వాసనతో ఇబ్బంది పడ్డారు. తీరా ఆరా తీస్తే డ్రైనేజీ మురుగు నీరు నల్లా నీటిలో కలిసి ఇండ్లలోకి రావడం వల్లే దుర్వాసన వస్తోందని గ్రహించారు. అయితే మిషన్ భగీరథ నీటినే తాగాలని సూచించే అధికారులు ఇలా డ్రైనేజీ నీటిని సరఫరా చేసి ప్రాణాలు తీస్తారా? అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిబంధనలు బేఖాతార్



బొంరెడ్డిపల్లిలో వెలిసిన వెంచర్

కులకచర్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలం రోజురోజుకు విస్తరిస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకొని కులకచర్ల మండలంలోని ఆయా గ్రామాల్లో అక్రమ వెంచర్లు వెలుస్తున్నాయి. ఇళ్ల ప్లాట్లకు వస్తున్న డిమాండ్ నేపథ్యంలో రియల్టర్లు ఎలాంటి నిబంధనలు పాటించకుండా వెంచర్లు ఏర్పాటుచేసి ప్రజలకు విక్రయిస్తున్నారు. కొత్త ప్రభుత్వ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. అరచేతిలో స్వర్గం చూపుతూ రియల్టర్లు కొనుగోలుదారులకు ప్లాట్లు విక్రయిస్తున్నారు. వెంచర్‌కు అనుమతి తీసుకోకుండా గుంట లెక్కన విక్రయిస్తున్నారు. కులకచర్లతో పాటు బొంరెడ్డిపల్లి గ్రామంలో రియల్టర్లు చేప్పేది ఒకటి చేసేది మరొకటిగా మారింది. వెంచర్‌కు డీటీసీపీ, రెరా లాంటి సంస్థల అనుమతులు తీసుకున్నామని అన్నీ అనుమతులు ఉన్న ప్లాట్లు తక్కువ ధరకే విక్రయిస్తున్నామంటూ నమ్మబలుకుతున్నారు. ఇల్లు కట్టుకుంటే బ్యాంకు లోన్ వస్తుందని చెబుతున్నారు. ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ లాంటి చార్జీలేవీ కట్టనవసరం లేదని, రోడ్లు, నీటి వసతి, విద్యుత్ సదుపాయం లాంటివి తామే కల్పిస్తామని చెప్పి బుట్టలో వేసుకుంటున్నారు. సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులకు తెలియకుండానే ఈ తతంగం నడుస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పాలన గాడిన పడేనా?

● పడకేసిన పారిశుధ్యం ● వెలగని విద్యుద్దీపాలు ● పట్టించుకోని అధికారులు



చీర్యాల్ ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

కీసర, మే 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామపంచాయతీల పరిస్థితి దారుణంగా మారింది. పాలనా వ్యవస్థ సరిగ్గా లేక గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. విద్యుద్దీపాలు వెలగడంలేదు. మురుగు నీరు ప్రధానరోడ్లపై పారుతోంది. తాగునీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల దమ్మాయిగూడ మున్సిపల్ విలీనమైన కీసర, చీర్యాల్, యాద్గార్‌పల్లి, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు కేవలం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయానికే పరిమితం అవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

మేజర్ ప్రాంతాలైన కీసర, చీర్యాల్‌లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడేఅన్న చందంగా మారింది. చీర్యాల్ నుంచి కీసరకు వచ్చే దారిలో హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద ఉన్న కల్వర్టు దగ్గర చెత్తాచెదారం పేరుకుపోయింది. దుర్వాసన వెదజల్లి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా చికెన్, మటన్ షాపుల వ్యర్థాలు, వీరికితోడు రాత్రిళ్లు లారీలు, ఆటోలు, చిన్నచిన్న ట్రక్కుల్లో వ్యర్థాలను తీసుకొచ్చి ఇక్కడ డంప్ చేస్తున్నారు. గతంలో గ్రామపంచాయతీ పాలకవర్గం జరిమానాలు విధించింది. అయినా పరిస్థితిలో ఎలాంటి మార్పులేదు. ఇక్కడే కాకుండా కీసర నుంచి భోగారం, కీసర నుంచి యాద్గార్‌పల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై కూడా ఇదే పరిస్థితి. ఇదిలాఉండగా కీసర ప్రధాన చౌరస్తాలో కొన్ని నెలలుగా హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. దీంతో చౌరస్తా పూర్తిగా అంధకారంలో ఉంది. దీనిపై సంబంధిత అధికారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోతున్నారు.

కమిషనర్ అనుమతి తీసుకోవాలా?

వీధుల్లో లైట్లు చెడిపోయి నెలలు గడుస్తున్నా వాటి మరమ్మతులు గానీ, కొత్తవాటిని ఏర్పాటు చేసే పరిస్థితి లేదంటే పాలనా వ్యవస్థ ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. విద్యుద్దీపాలు వెలగడంలేదని స్థానిక వార్డు కార్యాలయం అధికారులకు ఫిర్యాదుచేస్తే, కమిషనర్ గారికి చెప్పండని అంటున్నారని స్థానికులు తెలిపారు. కనీసం విద్యుత్ స్తంభాలకు అమర్చే ఎంసీబీ కావాలన్నా, మున్సిపల్ కమిషనర్ అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు అంటున్నారు. ఇదిలా ఉండగా ఒకవైపు వేసవిలో కొన్ని కాలనీలకు మిషన్‌భగీరథ నీరురాక నీటికి ఇబ్బందులు పడుతుంటే మరోవైపు కీసర ప్రధాన చౌరస్తాలో నీరు వృథాగా పోతోంది. ఇక ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అక్రమ నిర్మాణాలను కట్టడి చేయడంలో కూడా అధికారులు చేతులేశారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు నిర్మిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకొని విలీనమైన గ్రామాల్లో పాలనా వ్యవస్థ గాడిన పడేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కీసర ప్రధాన చౌరస్తాలో వెలగని హైమాస్ట్ లైట్లు

సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి?

● అంధకారంలో తాండూరు మున్సిపాలిటీ
● వెలగని స్ట్రీట్ లైట్లు
● మరమ్మతుకు నోచుకోని పైప్‌లైన్లు
● ప్రత్యేక అధికారుల పాలనలో అవస్థలు



సెయింట్ మార్క్స్ హైస్కూల్ ఎదుట వెలగని లైట్లు

తాండూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేకాధికారుల పాలనలో సమస్యలు పరిష్కారం అవుతాయనుకున్న ప్రజలు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని తాండూరు పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

డార్క్ హైవే

నేషనల్ హైవేగా గుర్తింపు పొందిన చించోళి రోడ్డు స్ట్రీట్ లైట్స్ వెలుగక 15రోజులు దాటిపోయింది. ఇది ప్రధానమైన రోడ్డు అయినప్పటికీ ఇంజనీరింగ్ అధికారులు కనీసం పరిశీలించడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. శివాజీ చౌక్, మారికంబా కాలనీ, సీసీఐ కాలనీ, భగీచ, సెయింట్‌మార్క్స్ హైస్కూల్ ప్రాంతాల ప్రజలు చీకట్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధి దీపాలు వెలగడం లేదని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు.

వృథా అవుతున్న మిషన్ భగీరథ నీరు

తాండూరు పట్టణంలో పలు కాలనీల్లో పైప్‌లైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. పలు ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకేజీతో నీరు కలుషితమై రోగాల బారినపడే అవకాశాలు ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. పాత తాండూరు, మల్‌రెడ్డిపల్లి, భవానీనగర్, సెయింట్ మార్క్స్ హైస్కూల్ ప్రాంతాల్లో లీకేజీలతో కలుషితనీరు వస్తోందని, అక్కడి ప్రజలు నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఇవి మచ్చుకు మాత్రమే. తాండూరు పట్టణంలో చాలా ప్రాంతాల్లో లీకేజీలు ఉన్నాయి. ప్రస్తుతం చిరుజల్లు కురుస్తుండడంతో పైప్‌లైన్ లీకేజీలు అరికట్టకపోతే డయేరియా కేసులు వచ్చే అకాశాలున్నాయని పలువురు అంటున్నారు.



వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

వానాకాలం సాగుకు సన్నద్ధం

● పొలంబాట పట్టిన రైతన్నలు, కూలీలు ● వరుణుడి కోసం ఎదురుచూపులు



పొలాన్ని చదును చేస్తున్న రైతులు

తాండూరు రూరల్, మే 25, (ఆంధ్రజ్యోతి): వారం రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభమవుతుండటంతో రైతన్నలు పొలాలను చదును చేసేపనిలో నిమగ్నమయ్యారు. పొలాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని కూలీలతో తీయించడంతోపాటు, పొలాలను దున్నుతూ పంటలు వేసుకునేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. మరి కొందరు విత్తనాల కొనుగోలుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సీజన్‌లో వాతావరణం చల్లబడటంతో రుతుపవనాలు త్వరలోనే వస్తున్నాయని శాస్త్రవేత్తల ప్రకటనలతో రైతులు ఇప్పటికే తమ పనులు పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్నారు. వర్షాలు కురియగానే రైతులు విత్తనాలను విత్తుకోనున్నారు.

వర్షాధారంగానే పంటల సాగు

తాండూరు మండల పరిధిలో పెద్దగా ప్రాజెక్టులు లేకపోవడంతో 90శాతం మంది రైతులు వర్షాధారంగానే పంటలు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం ప్రధానంగా విత్తనాల ఎంపికలో మేలురకం విత్తనాలపైనే దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓవక్క ఇప్పటికే వ్యవసాయ భూముల్లో రైతులు భూములను చదును చేసుకుని విత్తనాలు విత్తేందుకు సిద్ధం చేసుకున్నారు. తాండూరులో ఈ సారి ప్రధానంగా పత్తి, కంది, మక్కజొన్న, సోయాబీన్, పెసర, మినుము వంటి పంటలపైనే రైతులు ప్రధానంగా దృష్టిసారిస్తున్నారు.

సుమారు 11,500 హెక్టార్లలో పంటల సాగు

తాండూరు మండల పరిధిలోని 15వేల హెక్టార్లలో భూములుండగా, 11,500 హెక్టార్లలో పంటలు సాగు చేసే అవకాశం ఉంది. పత్తి 1800హెక్టార్లకు గానూ 1200 హెక్టార్లు, కంది 9వేల హెక్టార్లకు గాను 8వేల హెక్టార్లు, పెసర 1200 హెక్టార్లకు గాను 900 హెక్టార్లు, మినుము 1400 హెక్టార్లకు గాను 1100 హెక్టార్లు, సోయాబీన్ 1వెయ్యి హెక్టార్లకు 650 హెక్టార్లలో పంటలుసాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు తెలిపారు. రైతులు తొందరపడి నకిలీ విత్తనాలను కొనుగోలు చేయకుండా నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తొలకరి ప్రారంభం కానుండటంతో పనులు చకచకా పూర్తి చేసేందుకు సామగ్రితోపాటు రసాయనిక ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే పొలాలను చదును చేసి గ్రామీణ ప్రాంతంలోని రైతులు సేంద్రియ ఎరువులను చల్లి భూములను సిద్ధం చేశారు.

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి



ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులు పంటలు విత్తుకునే ముందు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి. గ్రామాల్లో విక్రయించే వారి వద్ద విత్తనాలు కొనరాదు. నకిలీ విత్తనాలు కొని మోసపోకుండా లైసెన్స్ గల డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు రశీదును పొంది, అట్టి రశీదును పంట పూర్తయ్యే వరకు ఇంట్లో భద్ర పరుచుకోవాలి నకిలీ విత్తనాలపై రైతులకు ఇప్పటికే ఏఈవోల ద్వారా అవగాహన కల్పించాం.

- కొమరయ్య, తాండూరు మండల వ్యవసాయాధికారి

రైతు భరోసా కోసం ఎదురుచూపు

కొడంగల్ రూరల్: వానాకాలం సీజన్ సమీపిస్తున్న తరుణంలో రైతులు 'రైతు భరోసా' కోసం గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, దూద్యాల్ మండలాల్లో మొత్తం 58,312 మంది రైతులు ఉన్నారు. వానాకాలంసీజన్‌లో ప్రధానంగా పత్తి, కంది, పెసర, మినుము తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. పంటల సాగుకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సిద్ధం చేసుకోవడానికి పెట్టుబడికి డబ్బులు ముందుగానే సమకూర్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించి నాలుగు ఎకరాలపై బడిన రైతులకు ఇంతవరకు రైతుభరోసా డబ్బులు వేయలేదు. రైతులంతా పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. పంటల సాగుకు ప్రభుత్వం రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.



చిట్లపల్లి శివారులో పొలంలో పత్తి కట్టె కుప్పలు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మేడ్చల్ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అత్వెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2006-2007కు చెందిన పూర్వ విద్యార్థుల ఆదివారం ఒకేచోట చేరారు. వారు చదువుకున్న పాఠశాలే ఇందుకు వేదికైంది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆలయం ఆవరణలో ఉన్న సరస్వతీ ఆలయంలో విద్యార్థులు పూజలు నిర్వహించారు. పాఠశాలలో చదువుకున్న రోజుల్లోని మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు.

అభివృద్ధిలో ముందడుగు

యాలాల, మే 25 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో యాలాల మండలం అభివృద్ధిలో ముందడుగు వేస్తున్నట్లు యాలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు ఇప్పటికే సీసీరోడ్లు, మురుగు కాల్వలు తదితర పనులు చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని ప్రతి కాంగ్రెస్ నాయకులతో కలిసిమెలిసి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. పార్టీలో ఎలాంటివిభేదాలకు తావులేకుండా ఉండేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తాండూరు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు.

నకిలీ మందుతో రైతన్నకు మోసం

● రంగు మారిన కొత్తిమీర
● రూ.లక్ష నష్టపోయానని అన్నదాత ఆవేదన

పరిగి, మే 25 (ఆంధ్రజ్యోతి): సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ మందులు అంటగట్టి రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు ఎరువులతోపాటు, పిచికారి చేసే ముందుల కొనుగోళ్లలో వ్యాపారులు వారి ఇష్టమొచ్చిన మందులు ఇచ్చి తీవ్ర నష్టాలపాలు చేస్తున్నారు. పంటలసాగులో చీడపీడల నివారణలో క్రిమిసంహారక మందుల వాడకంలో రైతులకు తెలియక షాపుల యజమానులను అడిగితే వారు ఇష్టం వచ్చిన వాటిని ఇస్తున్నారు. వాటిని వాడితే పంటలకు తీవ్రనష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు.



కొత్తిమీర పంటకు పిచికారి చేసిన మందు



రాఘవాపూర్‌లో నకిలీ మందు పిచికారితో రంగు మారిన కొత్తిమీర పంట

పరిగి మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన రైతు బోయిని రాములు అర ఎకరం పొలంలో కొత్తిమీరను సాగుచేశాడు. పంట ఎదగడం లేదని పరిగిలోని ఓ షాపునకు వెళ్లి అడిగితే మూడు రకాలు మందులు ఇచ్చారు. వాటిని తీసుకొని పిచికారి చేయగా మరుసటి రోజే కొత్తిమీర రంగుమారి, వాడిపోయి పనికిరాకుండా పోయిందని సదరు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సంబంధిత అధికారులు స్పందించి రైతులను మోసం చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

దుకాణదారు దబాయిస్తున్నాడు



కొత్తిమీర ఏపుగా పెరిగేందుకు షాపులో అడిగితే మూడు రకాల మందు ఇచ్చారు. తీసుకొని కొత్తిమీర పంటకు పిచికారి చేశా. మరుసటిరోజే రంగుమారి పనికిరాకుండా పోయింది. నకిలీ మందు పిచికారి చేయడం వల్ల రూ.లక్ష నష్టపోయా. తిరిగి దుకాణదారుడిని అడిగితే దబాయిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

- బి.రాములు, రైతు, రాఘవాపూర్, పరిగి మండలం

వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ

ఘట్‌కేసర్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రోడ్లపక్కన చిరువ్యాపారులు చేసుకునే వారికి పోచారం లయన్స్ క్లబ్ నిర్వాహకులు గొడుగులను అందజేశారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని జోడిమెట్ల చౌరస్తా వద్ద పండ్లు, కూరగాయలు అమ్ముకుని జీవనం సాగించే గూడెం లక్ష్మి, దాసరి దుర్గాభావని, దాసరి మహేష్‌ల ఇబ్బందులను గమనించి వారికి గొడుగులను అందజేసినట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధులు రాజమళి, ఏఎస్ సుందరం, చంద్రశేఖర్, శ్రీశైలం, సురేందర్, సుదర్శన్, రాయప్ప తదితరులు పాల్గొన్నారు. వారికి చిరువ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు.



వీధి వ్యాపారులకు గొడుగులను అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

క్రైం కార్నర్

బస్సుకింద పడి మహిళకు తీవ్రగాయాలు

● డ్రైవర్ అజాగ్రత్తే కారణం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలమణి

తాండూరు రూరల్, మే 25, (ఆంధ్రజ్యోతి) : బస్సుకింద పడి ఓ మహిళ తీవ్ర గాయాలపాలైంది. ఈ ఘటన తాండూరు మండలంలో చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరన్‌కోట్‌కు చెందిన బోయమోళ్ల బాలమణి తన తల్లి ఊరికి వెళుతుండటంతో బస్సు ఎక్కించేందుకు స్థానిక బస్టాండ్ వద్దకు వచ్చింది. అక్కడ ఆర్టీసీ బస్సులో తల్లిని ఎక్కించి ఆమె కిందికి దిగుతోంది. ఈ క్రమంలో గమనించని డ్రైవర్ అజాగ్రత్తతో ఒక్కసారిగా బస్సును ముందుకు కదిలించాడు. దీంతో బాలమణి ఎడమ కాలు మీద నుంచి బస్సు వెళ్లింది. ఈ ప్రమాదంలో బాధితురాలి కాలు విరిగి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు వికారాబాద్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

కులకచర్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండుట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. మండలంలోని బొంరెడ్డిపల్లి గ్రామం నుంచి ఆదివారం తెల్లవారుజామున అనుమతి లేకుండా రెండు ట్రాక్టర్లలో ఇసుకను కులకచర్లకు తరలిస్తున్నారు. విధి నిర్వాహణలో ఉన్న పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించగా చౌరస్తాలో ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పీఎస్‌కు తరలించి ట్రాక్టర్లను సీజ్ చేసి యజమానులు ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కీసర రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగ తెగి పడిగాయాలపాలైన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. నాగారం మున్సిపాలిటీ బాపురెడ్డి కాలనీకి చెందిన సురేష్ తన భార్య మౌనిక(30) మూడేళ్ల కుమారుడు శ్రేయాంశ్‌తో కలిసి శనివారం రాత్రి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో వీరాంజనేయ స్వామి ఆలయ పరిసరాల్లోకి చేరుకోగానే ఈదురుగాలుల తీవ్రతకు విద్యుత్ వైరుతెగి బైక్‌పై ఉన్న మౌనికపై పడింది. దీంతో వారు విద్యుదాఘాతానికి గురై కిందపడ్డారు. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో గాయపడిన సురేష్, అతడి కుమారుడు శ్రేయాంశ్‌లు క్షేమంగానే ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

జిల్లా విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నెంబర్ల మార్పు

వికారాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు విద్యుత్‌శాఖ కాలక నిర్ణయం తీసుకుందని విద్యుత్ శాఖ ఎస్ఈ రవి ప్రసాద్ తెలిపారు. ఈఎస్ఈ 8712469715, ఎస్ఏవో 8712469720, డీఈ 8712469716, డీఈ ఓపీ 8712469717, డీఈ తాండూరు 8712469718, ఏడీఈ 8712469723, ఏడీఈ పరిగి 8712469724, కొడంగల్ ఏడీఈ 8712469726, ఏఈ వికారాబాద్ 8712469739, వికారాబాద్ రూరల్ ఏఈ 8712469740, ధారూరు ఏఈ 8712469741, మోమిన్‌పేట ఏఈ 8712469742, మర్పల్లి ఏఈ 8712469743, పరిగి ఏఈ 8712469744, దోమ ఏఈ 8712469745, ఏఈ కుల్కచర్ల 8712469746, మన్నెగూడ ఏఈ 8712469747, చౌడాపూర్ ఏఈ 8712469748, తాండూరు టౌన్ 8712469749, తాండూరు రూరల్ 8712469750, పెద్దేముల్ 8712469751, బషీరాబాద్ ఏఈ 8712469752, దుద్యాల్ ఏఈ 8712469753, యాలాల్ ఏఈ 8712469754, బంట్వారం ఏఈ 8712469755, బొంరాస్‌పేట ఏఈ 8712469756, కొడంగల్ ఏఈ 8712469757, దౌల్తాబాద్ 8712469758, కోట్‌పల్లి ఏఈ 8712469759, వికారాబాద్ కంట్రోల్‌రూమ్ 8712469839 నెంబర్లను సంప్రదించాలన్నారు. ప్రజలు తమ ప్రాంతానికి అనుగుణంగా ఆయా నంబర్లకు డయల్ చేసి ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు.

బాల్య మిత్రుడికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న 1998-1999 బ్యాచ్ మిత్రబృందం

ఘట్‌కేసర్ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న 1989-1999 బ్యాచ్‌కు చెందిన పాకం యాదగిరి అనారోగ్యానికి గురికావడంతో తోటి స్నేహితులు అండగా నిలిచారు. అతడి మిత్రులందరూ కలిసి రూ.57వేలు పోగుచేసి ఆదివారం యాదగిరికి అందజేశారు. తమ స్నేహితుడి ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆకాంక్షిస్తూ కుటుంబసభ్యులకు మనోధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో 1989-1999 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్ధారణ శిబిరాలు వినియోగించుకోవాలి



వైద్యాధికారి అమూల్య ప్రియదర్శిని

దౌల్తాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి అమూల్య ప్రియదర్శిని తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 27న మాటూర్‌లో క్షయవ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 10న చంద్రకల్, 24న ఈర్లపల్లి, జూలై 8న బాలంపేట్, 18న కుదురుమళ్ల, ఆగస్టు 19న దౌల్తాబాద్‌లో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

'పీఎం మన్‌కీ బాత్'ను వీక్షించిన బీజేపీ నాయకులు

కులకచర్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నేతలు అంతారం గ్రామంలో ఆదివారం బూత్ అధ్యక్షుడు మొగులయ్య నివాసంలో టీవీలో తిలకించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గాదె మహిపాల్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, నాయకులు వెంకటేశ్, హనుమంతు, గోపాల్, జోగు హన్మయ్య, మహిపాల్‌రెడ్డి, అశోక్, అంజలయ్య, శ్రీకాంత్, మల్లేశ్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.